సాక్షి
శ్రీకాకుళం

సోమవారం । 10 । ఏప్రిల్ । 2023



క్రీడా సందడి

జిల్లాలో క్రీడా సందడి నెలకొంది. ఆటల దుకాణాల్లో సందడి కనిపిస్తోంది.

- 8లో



అనుమానాస్పద మృతి

హరిపురంలో ఓ కార్పెంటర్ అనుమానాస్పదంగా మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	35°	25°
ఇచ్ఛాపురం	36°	25°
పలాస	35°	26°
టెక్కలి	34°	24°
పాతపట్నం	36°	24°
నరసన్నపేట	35°	25°
శ్రీకాకుళం	35°	25°



న్యూస్‌రీల్

పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని తంగివానిపేట గ్రామానికి చెందిన సాధు మాధవరావుకు చెందిన గోడౌన్ నుంచి అక్రమంగా లారీల ద్వారా రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. రూ.8,47,400 విలువ చేసే 22300 కిలోల పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం ప్రాంతీయ నిఘా అధికారి సురేష్‌బాబు ఆదేశాల మేరకు విజిలెన్స్ సబ్ ఇన్‌స్పెక్టర్ అశోక్, పౌరసరఫరాల అధికారి కిరణ్‌దేవ్‌లు కలిసి పట్టుకున్నారు. ఈ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి అధిక ధరలకు అమ్మేందుకు రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

డీఆర్‌వలస హైస్కూల్ హెచ్‌ఎం సస్పెన్షన్

శ్రీకాకుళం న్యూకాలనీ : జిల్లాలోని జి.సిగడాం మండల పరిధిలో ఉన్న డీఆర్‌వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తురక బలరాంపై సస్పెన్షన్ వేటు పడింది. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో అధికారులు విచారణ చేపట్టిన అనంతరం బలరాంను సస్పెండ్ చేస్తూ డీఈఓ గార పగడాలమ్మ ఆదివారం ఉత్తర్వులు వెలువరించారు.

ఉత్సాహంగా జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు



క్రీడాకారుల ప్రతిభను పరిశీలిస్తున్న సెలెక్టర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సీనియర్స్ పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 120 మంది వరకూ క్రీడాకారులు హాజరయ్యారు. ఈ ఎంపికల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులను జిల్లా ప్రాబబుల్స్‌కు ఎంపిక చేస్తామని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్తాక్ మహ్మద్ వెల్లడించారు. ప్రాబబుల్స్ జాబితాను త్వరలో వెల్లడిస్తామన్నారు. ఈ ఎంపికలకు చీఫ్ సెలెక్టర్‌గా కిల్లి సుదర్శన్ వ్యవహరించగా సెలెక్టర్లుగా ఆర్‌సీ రెడ్డి, మదీనా సైలాన్, వర్ధన్‌లు వ్యవహరించారు.

ప్రతి పాఠశాలకు జేవీకే కిట్లు



ఉపాధ్యాయులతో జిల్లా విద్యాశాఖ అధికారి పగడాలమ్మ

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో ప్రతి పాఠశాలకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ అన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకాలంలో ఈ కిట్లు అందజేయనున్నట్లు చెప్పారు. నాణ్యతలో రాజీ పడకుండా కిట్లను ప్రభుత్వం అందజేస్తోందని అన్నారు. విద్యార్థుల జాబితాలు ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నట్లు వివరించారు. కిట్ల పంపిణీకి పాఠశాలల వారీగా బృందాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రతి విద్యార్థికీ కిట్లు చేరుతాయని, ఉపాధ్యాయులు నాణ్యత పరిశీలించి తీసుకోవాలని అన్నారు.

వీధుల్లో వేడుక

వీధులు వేదికలవుతున్నాయి. ఇంటి అరుగులు సభాస్థలాలుగా మారుతున్నాయి. నాయకులు ప్రజా స్పందనకు ప్రత్యక్ష సాక్షులవుతున్నారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా జనం వద్దకు వెళ్తున్న ప్రజా ప్రతినిధులకు జనుల మనసు తెలుస్తోంది. వృద్ధుల నుంచి యువకుల వరకు, మహిళల నుంచి బాలికల వరకు పథకాల ద్వారా లబ్ధి పొందిన వారు తమ ఆనందం వ్యక్త పరుస్తున్నారు. ఇలాంటి పాలన కలకాలం కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు.



లావేరు: తాళ్లవలసలో సంక్షేమ పథకాల గురించి గ్రామస్తులకు తెలియజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ శివాజీ నగర్‌లో ఇంటికి స్టిక్కర్లు అతికిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు



మెళియాపుట్టి: ప్రజలు చెబుతున్న సమాధానాలు రాసి స్లిప్పులు వారికి అందిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

జగనన్నే నాదైవం...



నాకు ఎడమ కాలు లేదు. ఈ ప్రభుత్వమే నాకు పింఛన్ ఇచ్చింది. నా కుటుంబానికి చేయూత ఇచ్చింది. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా సీఎం వైఎస్ జగన్ మాట మీద నిలబడ్డారు. ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు. ఆయనే నా దైవం.

– నూక మల్లేశ్వరరావు, గుంజిలోవ గ్రామం (కోటబొమ్మాళి మండలం గుంజిలోవలో జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో..)

జగన్‌ను గెలిపించుకుంటాం

చంద్రబాబు టైమ్‌లో నాకు వచ్చే పింఛన్ సరిపోయేది కాదు. ఇప్పుడు పింఛన్ నా మందులు, ఇతర అవసరాలకు సరిపోతోంది. మా ఇంటికే వచ్చి పింఛన్, రేషన్ బియ్యం అందిస్తున్నారు. నా మనవడు జగన్‌నే మళ్లీ గెలిపించుకుంటాం.

– కొర్లాన ముత్యాలమ్మ (టెక్కలి మండలం గూడేం గ్రామంలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో..)



నాకు ప్రాణం పోశారు

ఎల్.ఎన్.పేట: ఎల్.ఎన్.పేట మండలంలోని గొట్టిపల్లి గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధి గ్రస్తుడు పొందూరు అప్పన్న సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆ గ్రామంలో మాజీ ఎంపీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శిమ్మ సాంబశివరాలు ఆధ్వర్యంలో ఆదివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అప్పన్న ఇంటికి వెళ్లగా.. కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న తనకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఎలా అండగా నిలిచిందో ఆయన వివరించారు. ప్రతి బుధవారం, శనివారం ఇంటి నుంచి శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తీసుకువెళ్లి డయాలసిస్ పూర్తయిన తరువాత అదే అంబులెన్స్‌లో ఇంటికి అప్పగిస్తున్నారని, ప్రతి నెల రూ.10వేలు పింఛన్ అందుతోందని, తనకు ప్రాణం పోసిన జగనన్న నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని కోరుతూ.. తన భార్యతో పాలు తెప్పించి పాలాభిషేకం చేశారు.



గొట్టిపల్లిలో సీఎం వైఎస్ జగన్ ఫొటోకు పాలాభిషేకం చేస్తున్న డయాలసిస్ పేషెంట్ అప్పన్న

పట్టుదలకు ప్రతిరూపం



జాతీయ స్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలో ఆడుతున్న రూపాదేవి

- కాళ్లు లేకున్నా కలలు సాకారం చేసుకుంటున్న సిక్కోలు యువతి
- పారా బ్యాడ్మింటన్ లీగ్ పోటీల్లో విజయ కేతనం
- జాతీయస్థాయిలో రాణిస్తున్న రూపాదేవి

జి.సిగడాం: ఆమెకు కాళ్లు పనిచేయవు. కానీ కలలు కనగలదు. అడుగు వేసే పరిస్థితి లేదు. అయితేనేం బతుకులో ముందడుగు వేయగలదు. అన్ని దిక్కులా అవరోధాలు అడ్డుగా ఉన్న చోట ఆ గోడలు దాటుకుని విజయ తీరాలు వెతికింది పడాల రూపాదేవి. పారా బ్యాడ్మింటన్ లీగ్‌లో ఒక్కో స్థాయిని దాటుకుంటూ ఏకంగా జాతీయ స్థాయిలో జెండా ఎగరేసింది. జి.సిగడాం మండలంలోని పడాల యశోద, సత్యనారాయణ రెండో కుమార్తె రూపాదేవి. చిన్నప్పుడే ఆమె తన తండ్రిని కోల్పోయింది. అప్పటి నుంచి తల్లి యశోద తన రెక్కల కష్టంతో సంతానాన్ని పెంచి పెద్ద చేసింది. సంతవురిటి జెడ్పీ హైస్కూల్‌లో 2015–16లో టెన్త్ పాసైంది. చక్కటి మార్కులు సాధించి ప్రభుత్వం చేత ప్రశంసలు కూడా అందుకుంది, 2019లో డిగ్రీ చదువుతుండగా డాబా మీద నుంచి పడిపోయి రెండు కాళ్లు పోగొట్టుకుంది.



కుటుంబ సభ్యులతో రూపాదేవి

దాతలు సహకరిస్తే..



నాకు దేశం తరపున ఆడాలని ఉంది. వచ్చే నెలలో జరిగే అంతర్జాతీయ పోటీలకు సిద్ధమవుతున్నాను. ఇప్పటికే మైసూర్‌లో శిక్షణ తీసుకున్నాను. పోటీలకు వెళ్లాలంటే ఒక ఆటకు సుమారుగా రూ.3లక్షలు ఖర్చవుతాయి. దాతలు సహకరిస్తే నాకు మేలు జరుగుతుంది.

– పడాల రూపాదేవి, జాతీయ పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

రాష్ట్రానికే గర్వకారణం..



పడాల రూపాదేవి మా గ్రామంతో పాటు రాష్ట్రానికి కూడా గర్వకారణం. ఆమెకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తాం. అధికారులు, నాయకులు ద్వారా సీఎం దృష్టికి తీసుకువెళ్లి అంతర్జాతీయ స్థాయిలో ఆటలు ఆడేలా కృషి చేస్తాం. – బుడారి లక్ష్మణరావు, సర్పంచ్, సంతవురిటి

అంత పెద్ద ప్రమాదం జరిగాక బతుకులో వేగం తగ్గిపోతుంది. కానీ రూపాదేవి అందరి కంటే భిన్నంగా వ్యవహరించింది. రెండు కాళ్లు లేకపోయినా అంతులేని ఆత్మవిశ్వాసంతో పారా బ్యాడ్మింటన్ పోటీలు ఆడడం ప్రారంభించింది. 2021 డిసెంబర్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచింది. దీంతో కొందరు దాతలు ఆమె శిక్షణకు సాయం చేశారు. మైసూరులో తర్ఫీదు తీసుకున్న ఆమె 2022 ఆగస్టులో బెంగళూరులో నిర్వహించిన పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలను సాధించింది.

నిరుపేద నేపథ్యం..

రూపాదేవిది చాలా సామాన్యమైన కుటుంబం. అందులోనూ దివ్యాంగత్వం. ఇలాంటి పరిస్థితుల్లో ఆటల వైపు దృష్టి సారించడం దాదాపు అసాధ్యం. కానీ రూపాదేవి ఆ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించింది. గత నెల 23, 26వ తేదీల్లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో నిర్వహించిన 5వ జాతీయ స్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ఒక బంగారు పతకం, రెండు వెండి పతకాలను సాధించింది. ఇప్పుడు అంతర్జాతీయ పోటీలకు సిద్ధమవుతోంది.

ఆదిత్యుని సన్నిధిలో భక్తజనం



సూర్యనమస్కారాల పూజలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లిలో ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి భానుని ప్రతాపం ఎక్కువగా ఉన్నప్పటికీ ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుంచే సర్వ దర్శనాలకు అవకాశమివ్వడంతో స్థానికులతో పాటు ఇతర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో తొలి దర్శనం చేసుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఎండ ప్రభావం లేకుండా టెంట్లు వేయించారు. ఆలయం ముందు ఇటీవల కాలంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన భారీ షెడ్లు ఉపయోగపడ్డాయని భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఒక్క రోజులో వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,51,300, పూజలు, విరాళాల ద్వారా రూ.69,899, లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా రూ.2.20 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలియజేశారు.

బహిరంగ సభకు స్థల పరిశీలన



పోర్ట్ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నవీన్

సంతబొమ్మాళి: మూలపేట(భావనపాడు) గ్రీన్‌ఫీల్డ్ పోర్టు శంకుస్థాపన కోసం అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. మూలపేటలో శంకుస్థాపనకు అనువైన ప్రదేశాన్ని జాయింట్ కలెక్టర్ నవీన్ ఆదివారం పరిశీలించారు. భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలంపై ఆరా తీశారు. పాలనాయుడు పేట నుంచి మూలపేట వరకు ఇరుకు రోడ్డు ప్రయాణం చేయాల్సి వస్తుంది. రెండు ఇరుకైన ఉప్పునీటి వంతెనలు దాటాల్సి ఉంది. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉండటం వల్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైతే మరో చోట అనువైన స్థలం పరిశీలించాలని ఆదేశించారు. కాకరాపల్లి పవర్ ప్లాంట్, నౌపడ పరిసర ప్రాంతాల్లో సభ ఏర్పాటుకు అనువైన స్థలం కోసం పరిశీలించామని అధికారులు జేసీ దృష్టికి తీసుకు వచ్చారు. ఆయనతో పాటు తహసీల్దార్ చలమయ్య, టెక్కలి సీఐ చంద్రమౌళి, సర్వేయర్ బాలరెడ్డి, ఆర్ఐ చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి అనిల్ ప్రభాస్, వీఆర్వో ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వైభవంగా తులసమ్మ సంబరాలు



అమ్మవారి సంబరానికి తరలివచ్చిన భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ సంబరం లొద్దపుట్టిలో ఆదివారం అంబరాన్ని తాకింది. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ సంబరంలో వేలాది మంది భక్తుల నడుమ మేళతాళాలతో అమ్మవారిని ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాటం, కోయనృత్యాలు, అంజాట, చెక్క భజన, తప్పెటగుళ్లు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్సీ నర్తు రామారావు,ఎంపీపీ బోర పుష్ప,జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వైద్య రంగానికి అగ్ర తాంబూలం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- పురుషోత్తపురం పీహెచ్‌సీకి శంకుస్థాపన
- రూ.కోటి విలువైన స్థలమిచ్చిన దాతలను అభినందించిన స్పీకర్



స్పీకర్ తమ్మినేని సీతారాంను సన్మానిస్తున్న స్థల దాత కిల్లి కుటుంబ సభ్యులు

సరుబుజ్జిలి: వైఎస్సార్ సీపీ హయాంలో వైద్య రంగానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్ర తాంబూలం ఇస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో పురుషోత్తపురం గ్రామంలో రూ. 2.30 కోట్ల వ్యయంతో నిర్మించనున్న కిల్లి వెంకటప్పలనాయుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభించారు. మండలానికి రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించి పురుషోత్తపురం గ్రామానికి కిల్లి వెంకటప్పలనాయుడు పేరుతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. మనుషులు శాశ్వతం కాదని వారి హయాంలో చేసిన మంచి పనులే సమాజంలో వారికి శాశ్వతంగా గుర్తింపు ఇస్తాయని తెలిపారు. ఎనిమిది మండలాలకు ఉపయోగపడుతున్న బలసలరేవు వంతెనను ఆమదాలవలస మండలంలో ఇసుకలపేట వద్ద మంజూరు చేసినట్లు తెలిపారు. మడ్డువలస ప్రాజెక్ట్ ద్వారా మరో 15 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.

చిరకాల కీర్తి..

రూ.కోటి విలువైన భూమిని ఆస్పత్రికి కోసం దానమిచ్చిన మాజీ ఎంపీపీ కిల్లి వెంకటగోపాల సత్యనారాయణను మనసారా మెచ్చుకున్నారు. పుట్టిన ఊరికి, తాను నమ్ముకున్న ప్రజలకు ఏదో మంచి చేయాలన్న కోరికతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయించడంలో సత్యనారాయణ సఫలీకృతం అయ్యారని అన్నారు. గ్రామ ప్రజలే తన కుటుంబంగా భావించి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. చిరకాలం కిల్లి వెంకటప్పలనాయుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, ఎంపీపీ కిల్లి రమాదేవి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, కిల్లి రామ్మోహనరావు, కిల్లి శ్రీరామ్మూర్తి, కిల్లి వెంకటరమణ, యువనేత కిల్లి వెంకటేష్, వైస్ సర్పంచ్ పైడి నర్సింహప్పారావు, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ జీవీ శివానందమూర్తి, బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, జిల్లా వైద్యాధికారి బొడ్డేపల్లి మీనాక్షి, ఆర్డీవో బొడ్డేపల్లి శాంతి తదితరులు పాల్గొన్నారు.

అమ్మో ఎండలు



మే నెల రాక ముందే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఎండలు మండిపోయాయి. భానుడి ప్రతాపానికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రజలు ఎవరూ రోడ్లపై కనిపించలేదు. జిల్లాలో అత్యధికంగా పాతపట్నం, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా మిగతా చోట్ల 35 డిగ్రీలు నమోదైంది.

–ఆమదాలవలస

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి చదరంగ పోటీలకు ఎంపికలు



చెస్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు, నిర్వాహకులు

టెక్కలి: చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెక్కలి మండలం దామోదరపురంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి చదరంగ పోటీల్లో పలువురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శ్రీకాకుళం నగరానికి చెందిన చంద్రమౌళి ప్రథమ, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కుప్పిలి సాయి వెంకట్ ద్వితీయ, మందసకు చెందిన లోకేష్ తృతీయ, బద్రి గ్రామానికి చెందిన అభినవ్ నాలుగో స్థానం సాధించారు. వీరికి వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చింతాడ మంజు గణపతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విజేతలైన క్రీడాకారులు వచ్చే నెల 26 నుంచి 29 వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.భీమారావు వెల్లడించారు.

సీపీఎస్ రద్దుపై నిర్ణయం ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

శ్రీకాకుళం: సీపీఎస్ రద్దు అంశంపై రాష్ట్ర రాజకీయ పార్టీలు నిర్ణయాన్ని ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు డిమాండ చేశారు. శ్రీకాకుళంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జిల్లా ఆఫీసు బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో సీపీఎస్ విధానం తీసుకువచ్చినప్పుడు వామపక్షాలు తప్ప మిగిలిన వారందరూ అనుకూలంగా ఓటువేశారన్నారు. సీపీఎస్ వద్దు అని 2004 నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు పోరాటాలు చేస్తున్నాయనిచెప్పారు. పాత పింఛన్ విధానంలోనికి వెళితే ఎన్ఎస్‌డీఎల్ డబ్బులు తిరిగి రావని కేంద్ర ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంధ్యా హారతిపై వీడియో షూటింగ్



ముహూర్తపు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం మజ్జిగౌరి అమ్మవారికి నిత్యం హారతి ఇస్తుంటారు. ఇందులో భాగంగా సాయంత్రం ఇచ్చే హారతి ప్రత్యేకం. దీనిపై స్థానిక కళాకారులు వీడియోను రూపొందిస్తున్నారు. దీనికి సంబంధించి పితామహాల్‌లోని చంద్రకళా ఫార్మ్‌హౌస్‌లో ముహూర్తపు షాట్ చిత్రీకరణకు ఆదివారంశ్రీకారం చుట్టారు. స్థానిక సెంచూరియన్ విశ్వవిద్యాలయం మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ పాఢి ఈ హారతిపై గీతాన్ని రచించారు. ఆయనతో పాటు ప్రముఖ హిందీ సినీ నేపథ్య గాయని అనురాధ పొడ్వాల్ దీనిని ఆలపించారు. గీతాన్ని దృశ్య రూపంలో భక్తులకు అందించేందుకు షూటింగ్‌కు శ్రీకారం చుట్టామని పాఢి తెలిపారు. సంగీతం బీకే మహంతి అందించగా, బీఫిల్మ్ నిర్మాణ సంస్థ చిత్రీకరిస్తోంది.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,670–00
బంగారం(22సి. 10గ్రా.)	54,700–00
వెండి (కిలో)	76,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹113	₹196	₹ 206

క్రీడా సందడి



ఓ స్పోర్ట్స్ షాపులో అందుబాటులో క్రీడాసామాగ్రీ



వాలీబాల్ గేమ్ సాధనలో క్రీడాకారులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న డంబెల్స్

- వివిధ టోర్నీలతో మైదానాలు కళకళ
- స్పోర్ట్స్ షాపుల్లో పెరిగిన క్రీడా సామగ్రి విక్రయాలు
- పరీక్షలు ముగుస్తుండటంతో మైదానం బాట పడుతున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇప్పటికే ఇంటర్మీడియెట్ పరీక్షలు ముగిశాయి. మరో వారం రోజుల్లో పది పరీక్షలు సైతం ముగియనున్నాయి. పిల్లలకు ఒంటిపూట బడులు మొదలయ్యాయి. ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీపట్టిన చిన్నారులు, విద్యార్థులు మైదానబాట పట్టేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఓవైపు టోర్నమెంట్లు, లీగ్ మ్యాచ్‌ల నిర్వహణతో మైదానాలు కళకళలాడుతున్నాయి. మరోవైపు స్పోర్ట్స్ షాపుల్లో క్రయవిక్రయాలు జోరందుకున్నాయి.

వేసవి శిబిరాలకు సన్నద్ధం..

జిల్లా కేంద్రంతో పాటు గార, కళింగపట్నం, సింగుపురం, ఇచ్ఛాపురం, సోంపేట, మకరాంపురం, పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం, టెక్కలి, నరసన్నపేట ఆమదాలవలస, ఎచ్చెర్ల, రణస్థలం తదితర ప్రాంతాల్లోని మైదానాల్లో క్రీడాకారులు, చిన్నారులు సందడి చేస్తున్నారు. వివిధ క్రీడాంశాల్లో నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకునేందుకు రెడీ అయిపోతున్నారు. త్వరలో మొదలయ్యే వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు సన్నద్ధమౌతున్నారు. మరికొంతమంది త్రివిధ దళాల్లో ఉద్యోగాలకు శారీరక దారుఢ్యాన్ని పెంచుకోవడంలో నిమగ్నమవుతున్నారు.

టోర్నీలు, లీగ్ మ్యాచ్‌లతో హడావిడి..

వేసవి సెలవుల్లో భాగంగా మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి, అంతర్రాష్ట్ర క్రీడా టోర్నీలు, లీగ్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు యువత ఇప్పటికే ప్రణాళిక వేస్తున్నారు. కొన్నిచోట్ల టోర్నమెంట్లు మొదలుపెట్టేశారు. ముఖ్యంగా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రీడాంశాల్లో టోర్నీలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీటితోపాటు ఫుట్‌బాల్, చెస్, క్యారమ్స్, కరాటే, తైక్వాండో, జూడో క్రీడాంశాల్లోను పోటీలకు కసరత్తులు చేసుకుంటున్నారు.

స్పోర్ట్స్ షాపుల్లో విక్రయాల జోరు..

ఒకప్పుడు స్పోర్ట్స్ మెటీరియల్స్ కోసం విశాఖ తదితర ప్రాంతాలకు వెళ్లేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. జిల్లా కేంద్రంలో విస్తారంగా స్పోర్ట్స్ దుకాణాలు వెలిశాయి. క్రీడా దుస్తుల విక్రయాలతోపాటు క్రికెట్ కిట్లు (బాల్స్, బ్యాట్స్, ప్యాడ్స్, గ్లోవ్స్), వాలీబాల్, షటిల్ రాకెట్స్ మొదలుకుని క్రీడా సామగ్రి విక్రయాలతో షాపుల్లో సందడి వాతావరణం నెలకొంది. ఫిట్‌నెస్ మెరుగు పరికరాలు, బండెల్స్ విక్రయాలు జోరందుకున్నాయి. టోర్నీల్లో విజేతలకు, క్రీడాకారులకు బహుమతులుగా అందజేసే ట్రోఫీలు, షీల్డ్స్, మెమెంటోలు, పతకాల విక్రయాలు కూడా పెరిగాయి. మరికొంతమంది ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటున్నారు.

ఎండలతో జాగ్రత్త..



ఎండల తీవ్రత నేపథ్యంలో ఉదయం 10.30 గంటల లోపు, సాయంత్రం 3.30 గంటల తర్వాత మాత్రమే మైదానాల్లో ఆడుకోవడం ఉత్తమం. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు గ్లూకోజ్, నిమ్మరసం, ఆరెంజ్ వంటి ద్రావణాలను అధిక మోతాదులో తీసుకోవాలి. కొబ్బరిబొండాలు, మజ్జిగ తీసుకోవడం మంచిది. టోపీ, షూ, సాక్సులు ధరించాలి.

– డాక్టర్ చౌదరి రాజేష్‌బాబు, శ్రీకాకుళం

మన్నికైనవి మేలు..



క్రీడాదుస్తులు, సామగ్రి కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. నకిలీ సామగ్రి కూడా వచ్చేస్తున్నాయి. ఒకటికి రెండు సార్లు చూసి కొనుక్కోవాలి. మన్నికైనవి తీసుకుంటే ఎక్కువ రోజులు వినియోగించవచ్చు కూడా.

– మొజ్జాడ వెంకటరమణ, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు

గెలుపోటములు సమానం..



క్రీడల్లో గెలుపోటములు సహజం. రెండింటినీ సమానంగా తీసుకోవాలి. తోటి ఆటగాళ్లతో స్నేహభావంతో మెలగాలి. అత్యుతమైన ఆటతీరును కనబర్చడమే క్రీడాకారులు చేయాల్సిన పని.

– బడి వెంకటరమణ, జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి

భయంతో కాదు బాధ్యతతో పన్నులు కట్టాలి



మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: పన్నులను భయంతో కాకుండా బాధ్యతతో కట్టాలని, కేంద్ర రాష్ట్రా ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థలు ట్యాక్సులతోనే ముడిపడి ఉంటాయని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. శ్రీకాకుళంలోని ఎఫ్‌సీఐ గోడౌన్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఏపీ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పరోక్ష పన్నులపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రం బాగుండాలి, రాష్ట్ర పరిస్థితులు బాగుండాలంటే నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం పన్నులు చెల్లించాలన్నారు. ప్రిన్సిపల్ కమిషనర్ ఎం.రఘురామరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆడిటర్ల సమస్యలు పరిష్కరించేందుకు అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కేంద్రం పరిధిలో రూ.1.60 లక్షల కోట్ల పన్నులు వసూలు కావడం వెనుక ట్యాక్సు కన్సల్టెంట్, ప్రాక్టీషనర్ల కృషి ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ ప్రెసిడెంట్ షరీఫ్‌ఖాన్, అసిస్టెంట్ కమిషనర్ శ్వేతా సురేష్, స్టేట్ సెక్రటరీ బి.రామశ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు తెలుగు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మనసుతోనే మోక్షసాధన



వక్తను సత్కరిస్తున్న మందిర సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: మోక్ష సాధనకు మనస్సు కీలకమైనదని గాయత్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఉపనిషన్మందిరంలో వివేక చూడామణి గ్రంథంలో మనోమయి కోశంపై ఆదివారం ప్రసంగించారు. మనసు నుంచి రజోగుణ, తమోగుణాలను దూరం చేయగలిగితే మోక్షసాధన సులువని వివరించారు. కార్యక్రమంలో చాగంటి బాపయ్య పంతులు, కొంచాడ కృష్ణమూర్తి, ఎం.వెంకటరమణ, ఎన్.నరసింహమూర్తి, వి.కామేశ్వరరావు, పి.వి.ఎస్ ప్రసాద్, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

శభాష్ పోలీస్

- గుర్తు తెలియని మృతదేహం తరలింపులో మానవత్వం చాటుకున్న పోలీసులు



గుర్తుతెలియని మృతదేహాన్ని మోస్తుకొస్తున్న పోలీసులు

కోటబొమ్మాళి: పోలీసులు మానవత్వం చాటుకున్నారు. గుర్తు తెలియని మృతదేహాన్ని సుమారు కిలోమీటరున్నర మోసి ఔదార్యం చాటుకున్నారు. కోటబొమ్మాళి మండలం దుప్పలపాడు పంచాయతీ కొప్పలపేటకు కిలోమీటరు దూరంలోని వ్యవసాయ పొలంలో గుర్తు తెలియని వ్యక్తి రెండు రోజుల కిందట చనిపోయాడు. ఎండ తీవ్రత, ఊరికి దూరంగా మృతిచెందడంతో సమాచారం ఎవరికీ తెలియలేదు. దీంతో శరీరం ఉబ్బి దుర్వాసన వెదజల్లడంతో ఆదివారం కొందరు స్థానికులు వెళ్లి పరిశీలించగా మృతదేహం గుర్తించారు. అనంతరం వీఆర్‌ఓ బమ్మిడి కూర్మారావుకు సమాచారం అందించారు. ఆయన కోటబొమ్మాళి పోలీసులకు ఫిర్యాదుచేశారు. రంగంలోకి దిగిన హెడ్ కానిస్టేబుల్ అరసవెల్లి విశ్వేశ్వరరావు, హోంగార్డు లింగమూర్తి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం తరలించేందుకు సమీపంలో ఎవరూ లేకపోవడం, రోడ్డుకు కిలోమీటరు దూరంలో ఉండటం, మధ్యాహ్నం సమయంలో ఎండ బాగా కాస్తుండంతో మరో ఇద్దరి సహాయంతో పాడిని తయారుచేశారు. దుర్వాసన సైతం లెక్కచేయకుండా మృతదేహాన్ని మోసుకుంటూ కిలోమీటరు దూరంలోని అంబులెన్సు వద్దకు చేర్చారు. అక్కడి నుంచి కోటబొమ్మాళి ప్రభుత్వా సుపత్రి మార్చురీకి తరలించారు. పోలీసుల చొరవను ఎస్ఐ ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ అభినందించారు. మృతదేహం వివరాలు తెలిసిన వారు 63099 90861 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కల్యాణం..కమనీయం!



శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: పాతశ్రీకాకుళంలో కలెక్టర బంగ్లా ఎదురుగా ఉన్న నాగావళి నదీతరంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక తిరుక్కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. శ్రీకూర్మం దేవస్థానం అర్చకుడు గోపినంబాళ్ల నల్లకూర్మానదాసు పర్యవేక్షణలో అర్చకులు బూరాడ వంశీకృష్ణ నేతృత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఉత్సమూర్తులను ప్రత్యేక మండపంపై ఉంచి మల్లె, బంతి వంటి పూలతో మండపాన్ని అలంకరించారు. అనంతరం వేదమంత్రాల నడుమ కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎల్.నందికేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, మజ్జి యోగేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

• వైభవంగా తిరువీధి



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

శ్రీకాకుళం నగరంలోని పుణ్యపు వీధిలో సీతారామచంద్రమూర్తి సహిత సువత్సలాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. డే అండ్ నైట్ కూడలి నుంచి బయలుదేరి ఇలిసిపురం, రైతుబజారు మీదుగా పుణ్యపు వీధి వరకు తిరువీధి సాగింది. 516 మంది మహిళలు కలశాలతో శ్రీరామనామ జపంతో పాల్గొనగా.. తప్పెటగుళ్లు, కోలాటం, హరేరామ భజన బృందాలు నృత్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అరసవల్లి ఆలయ అర్చకులు హరిబాబు, ఆలయ ధర్మకర్త ముక్కాల కొండబాబు, భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్



వేషధారణలో కళాకారులు



ఆకట్టుకున్న కళాకారుల విన్యాసం

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



క్రైస్తవారాధన మందిరంలో ఈస్టర్ వేడుకలు



తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రార్థనలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని క్రైస్తవులు ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా కళాశాల రోడ్డులోని క్రిస్టియన్ వర్ఫ్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో చర్చి నిర్వాహకులు జోయల్ గోడి మాట్లాడుతూ ఏసుప్రభువు మన కోసమే మరణాన్ని జయించాడని చెప్పారు. చర్చి వ్యవస్థాపకులు రెవ.గోడి శామ్యూల్ క్రీస్తు సందేశం వినిపించారు. చిన్నబజారులోని తెలుగు బాప్టిస్టు కేంద్రం వద్ద చర్చి పాస్టర్ ఎ.జాకబ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. సానావీధిలోని కల్వరి ప్రేయర్ టెంపుల్‌లో పాస్టర్ చల్లా కరుణాకర్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. డగ్లస్ హైస్కూల్ ప్రాంగణంలోని కీస్టోన్ చర్చిలో పాస్టర్ జోయల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్వయిర్ బృందం గీతాలను ఆలపించారు.

సేవల్లో సత్యసాయి సంస్థల ముందంజ



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు లింగరాజు

టెక్కలి: జిల్లాలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు అన్నారు. ఆదివారం టెక్కలి రోటరీనగర్‌లో సత్యసాయి శాంతి సుధా మందిరంలో జోనల్ స్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓ వైపు ఆధ్యాత్మిక, మరోవైపు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ సత్యసాయి సేవా సమితి స్వచ్ఛంద సేవలు జిల్లాలో ముందంజలో నిలిచాయన్నారు. చిన్నారులకు బాల వికాస్ ద్వారా నైతిక విలువలో బోధిస్తున్నామన్నారు. సత్యసాయి నిత్యాన్నపూర్ణ సేవా ద్వారా ఎంతో మంది అభాగ్యులకు అన్నదానం చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు రామచంద్రరావు, అనాధ గుప్తా, మల్లేశ్వరరావు, చంద్రమౌళి, సుధారాణి, లలిత, అన్నపూర్ణమ్మ, అమ్మాయమ్మ, నాగమణి, వెంకటలక్ష్మి, చంటి, నారాయణమూర్తి, జగదీశ్వరరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్ అనుమానాస్పద మృతి

మందస: మండలంలోని హరిపురంలో ఓ కార్పెంటర్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి గ్రామానికి చెందిన సింహాద్రి లోకేష్(38) వృత్తిరీత్యా కర్రపని చేస్తున్నాడు. అతనికి మద్యం సేవించే అలవాటు ఉంది. కొద్దిరోజులుగా హరిపురంలో కార్పెంటర్ పని చేస్తున్నాడు. ఆదివారం బస్టాండ్ వద్ద శరీరంపై గాయాలతో అచేతనంగా పడి ఉండటంతో స్థానికులు హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రంలో చేర్పించారు. అక్కడి నుంచి టెక్కలి జిల్లా ఆసుపత్రి నుంచి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ లోకేష్ ఆదివారం మరణించాడు. వడదెబ్బ వల్ల గానీ, అధిక మద్యం సేవించడం వల్ల గానీ మరణించి ఉంటాడని భావిస్తున్నారు. లోకేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.